


# అధినేత కేసీఆర్‌తో నేతల భేటీ

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా సీనియర్ నేతలు, మాజీ మంత్రులు భేటీ అయ్యారు. ఆదివారం ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో మర్యాద పూర్వకంగా భేటీ అయిన నేతలు జరుగుతున్న రాజకీయ పరిణామాలు సహా పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, వి. శ్రీనివాస్‌గౌడ్, కేపీ వివేకానంద గౌడ్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్ రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, కోరుకంటి చందర్ తదితరులు పాల్గొన్నారు.

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 34.9°c | 23.0°c |
| మెదక్ | 34.2°c | 20.5°c |
| ఖమ్మం | 34.0°c | 26.0°c |
| కరీంనగర్ | 32.0°c | 24.0°c |
| నల్లగొండ | 32.0°c | 23.0°c |
| రంగారెడ్డి | 32.0°c | 20.6°c |
| నిజామాబాద్ | 31.5°c | 22.9°c |
| హైదరాబాద్ | 31.3°c | 23.2°c |
| వరంగల్ | 31.0°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 30.5°c | 22.3°c |

# రుణమాఫీ చేసేదాకా నీ గుండెల్లోనే నిద్రపోతా

- అప్పటి వరకు బీఆర్ఎస్ వదిలిపెట్టదు
- కొండారెడ్డిపల్లికి వెళ్దాం డేట్, టైం చెప్పు
- ఎందరికి మాఫీ అయిందో తేల్చుదాం
- నా ఎత్తు గురించి మానేసి రైతుల గురించి ఆలోచించు
- నీ బుద్ధి, చరిత్ర, భాష.. అన్నీ కురచే
- 100 రోజుల్లో 6 గ్యారెంటీలేమైనయ్
- ఫోర్త్ సిటీకి భూమి ఎక్కడుంది? ఈ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- గాంధీ ఏ పార్టీకి కాకుండా పోయాడు
- సీఎం కొట్టండి.. చితక్కొట్టండి అంటే శాంతిభద్రతలు దెబ్బ తినవా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై హరీశ్ ఆగ్రహం



తెలంగాణ భవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ జరిగే వరకు సీఎం రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతానని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ పూర్తికాలేదని, ఇంకా 22 లక్షల మందికి జరగాల్సి ఉన్నదని పేర్కొన్నారు. రుణమాఫీ జరిగినట్టు సీఎం సొంతగ్రామం కొండారెడ్డిపల్లిలో చూపించాలని, తేదీ, సమయం ప్రకటిస్తే తాను వస్తానని సవాల్ విసిరారు. రుణమాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ వదిలిపెట్టదని హెచ్చరించారు. తన ఎత్తు గురించి మాట్లాడే రేవంత్‌రెడ్డి తన ఎత్తుకు పెరగలేదని ఎద్దేవా చేశారు. రేవంత్ బుద్ధి, చరిత్ర, భాష అన్నీ కురచేనని విమర్శించారు. రేవంత్ మాటలను బట్టి బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై గాంధీతో దాడి చేయించింది ఆయనేనని అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, శివకుమార్, వాసుదేవరెడ్డితో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మాట్లాడారు. రాష్ట్ర ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బందులు పడుతున్నారని, ఒకటి వానల వల్ల వచ్చేది అయితే, రెండోది సీఎం అబద్ధాల వరద అని విమర్శించారు. తన కుర్చీకైనా మర్యాద ఇవ్వాలని రేవంత్ ఇటీవల అన్నారని, అలా జరగాలంటే భాష, వ్యవహారశైలి, నడవడిక మర్యాదగా ఉండాలని స్పష్టం చేశారు. బూతులు మాట్లాడి మర్యాద రమ్మంటే ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. తనను తాటిచెట్టు అన్నందుకు.. తాను లిల్లీపుట్ అని తిరిగి అనొచ్చని, తనను సన్నాసి అంటే తాను కూడా సన్నాసి అనగలనని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

> రాష్ట్రంలో ప్రజలు రెండు రకాల వరదలతో ఇబ్బంది పడుతున్నారు. ఒకటి ప్రకృతిపరమైన వరద, రెండోది ముఖ్యమంత్రి అబద్ధాల వరద. -హరీశ్

> మాట తప్పిన సన్నాసి, మోసం చేసిన సన్నాసి అని నేను కూడా వందసార్లు అనగలను. కానీ, నాకు సంస్కారం ఉన్నది. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని మాట తప్పిన సన్నాసివి నువ్వు కాదా? -హరీశ్

### ఎంత తండ్లాడినా ఎత్తు పెరగలేవు

తన ఎత్తు గురించి పదేపదే రేవంత్ దుర్భాషలాడుతున్నాడని, తన ఎత్తుపై ఎందుకంత ఈర్ష్య అని హరీశ్‌రావు ప్రశ్నించారు. 'నేను పొడుగే. అది దేవుడిచ్చింది. తెలంగాణ ఉద్యమం నన్ను మరింత పొడుగు చేసింది. నువ్వు ఎంత తండ్లాడినా నా అంత ఎత్తు పెరగలేవు' అని రేవంత్‌కు తేల్చి చెప్పారు. చిల్లర మాటలు బంద్‌చేసి రాష్ట్రం గురించి, రైతుల గురించి, ప్రజల గురించి ఆలోచించాలని రేవంత్‌కు హితవు పలికారు.

### ఏ ఊర్లోనైనా చెప్పించు

రుణమాఫీ జరిగిందని ఏ ఊర్లో అయినా చెప్పించాలని రేవంత్‌కు హరీశ్ సవాలు విసిరారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లో 122 మందిలో ఇంకా 82 మంది రైతులకు రూ. 1.05 కోట్లు ఇంకా మాఫీ కావాల్సి ఉన్నదని తెలిపారు. ఆ వివరాలు సీఎంకు పంపిస్తానని తెలిపారు. రుణమాఫీ జరిగి ఉంటే సురేందర్‌రెడ్డి ఎందుకు ఆత్మహత్య చేసుకుంటాడని ప్రశ్నించారు. 'రైతులను మోసం చేసింది నువ్వు, మాట తప్పింది నువ్వు, రుణమాఫీ చేయంది నువ్వు, ఇంకా నా గురించి మాట్లాడుతవా?' అని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తంచేశారు. డిసెంబర్‌లో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, రూ. 4 వేల పింఛను ఇస్తా అన్నది నువ్వు కాదా? మహిళలకు రూ.2500 ఇచ్చినవా? అని ప్రశ్నించారు. 'విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తానని మోసం చేసిన సన్నాసి నీవు కాదా? ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసిన సన్నాసివి నీవు కాదా?' అని సీఎంను దునుమాడారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక మంది రైతులు రూ. 2 లక్షల రుణం ఉన్నవారు పై మొత్తాన్ని చెల్లించారని, వారికి వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మాట మీద ఉండే మనిషివి అయితే వెంటనే రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు.

### ఫోర్త్ సిటీ ఎక్కడిది?

ఫోర్త్ సిటీ ఎక్కడిదని, దానికి భూమి ఎక్కడుందో చెప్పాలని హరీశ్‌రావు ప్రశ్నించారు. ఫార్మా సిటీకి కేసీఆర్ ప్రభుత్వం 12 వేల ఎకరాలను సేకరించిందని, ఫార్మా రంగంలో ఉద్యోగాలు, పెట్టుబడులు రావాలని, మంత్రిగా కేటీఆర్ రూ.1500 కోట్లు ఖర్చు చేసి భూమిని సేకరించారని హరీశ్‌రావు తెలిపారు. ఆ భూమిని ఫార్మా సిటీకి ఇవ్వకుండా దానిని ఏదో ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫార్మా సిటీ భూములను రైతులకు వాపస్ ఇస్తామని అన్నారని, రైతులకు భూములను వాపస్ ఇవ్వాలని, లేకుంటే ఫార్మా సిటీ పెట్టాలని డిమాండ్ చేశారు.

### నాడు ఉచిత కరెంట్.. నేడు ఉత్త కరెంట్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇచ్చిన ఉచిత కరెంట్ కాస్తా ఉత్త కరెంట్ అయిందని, 4, 5 గంటలు కూడా రాకపోయేదని, నిజమైన ఉచిత కరెంట్ ఇచ్చింది కేసీఆర్ హయాంలోనే అని హరీశ్‌రావు గుర్తుచేశారు. 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చామని, కనురెప్ప కొట్టినంత సేపు కూడా పోలేదని గుర్తుచేశారు.

### నీ గుండెల్లో దాక్కున్నా

'నేను ఎక్కడ దాక్కున్నా.. నీ గుండెల్లో దాక్కున్నా.. నీ గుండెల్లో నిద్రపోతున్న. నీకు నిద్ర పట్టనియ్యకుండా అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తుచేస్తూ మెడలు వంచి సగం రుణమాఫీ చేయించిన. మిగతా సగం చేయించేదాకా నీ వెంట పడుతూనే ఉంటా. రాష్ట్రంలో 42 లక్షల మంది రుణమాఫీ అయ్యే వరకు నీ గుండెల్లో నిద్ర పోతా' అని రేవంత్‌రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

> నేనెక్కడా దాక్కోలే. నీ గుండెల్లో నిద్రపోతూ, నిన్ను నిద్ర పోనివ్వకుండా చేస్తున్న. అనుక్షణం రుణమాఫీ గురించి గుర్తుచేస్తూ మీ మెడలు వంచి సగం మాఫీ చేయించా. మిగతా సగం చేసేదాకా నీ వెంటపడుతూనే ఉంటా. -హరీశ్

### అవి పగటి కలలు

రేవంత్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని, పదేపదే పదేండ్లు పాలిస్తామని చెప్తున్నారని హరీశ్ ఎద్దేవా చేశారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో ఐదేండ్లకే ఓడిపోయారని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు రెండుసార్లు వచ్చేంత సీన్ లేదని తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి ఐదేండ్లు ఉండేదే ఎక్కువని, ప్రజలు ఇప్పటికే బాధ పడుతున్నారని అన్నారు.

### బదిలీలే జరగలేదా..?

ఉపాధ్యాయుల బదిలీలు 18 ఏండ్ల తర్వాత చేపట్టామని రేవంత్ పచ్చి అబద్ధాలు చెప్తున్నాడని, 2018లో కేసీఆర్ ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. స్కూళ్లకు ఇంతకుముందు ఉచిత కరెంట్ లేనట్టుగా చెప్తున్నాడని, కానీ గతంలోనే ఉచిత కరెంట్ ఉందని, దీనికి సంబంధించిన మొత్తాన్ని స్కూళ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ గ్రాంట్‌ను బంద్ చేసి ప్రభుత్వమే విద్యుత్తుశాఖకు బిల్లులను చెల్లిస్తుందని పేర్కొన్నారు.

### సీఎం సన్నాయి నొక్కులు

అరికెపూడి గాంధీ ఇప్పుడు ఏ పార్టీకి కాకుండా పోయాడని హరీశ్‌రావు పేర్కొన్నారు. సీఎం మాటలను బట్టి తానే దాడిచేయించినట్టు అర్థమవుతున్నదని, పైగా హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటుందని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ముఖ్యమంత్రి మాట్లాడాల్సిన మాటనా? ఒక రాష్ట్రాన్ని పరిపాలించే విధానమా ఇది? నిజంగా ఆ రోజు కేసీఆర్ ఆలోచించి ఉండి ఉంటే ఏమైతుండే అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన ట్రిపుల్ ఆర్ ఉత్తర భాగాన్ని కూడా కాంగ్రెస్ ఘనకార్యంగా చెప్పుకుని అబద్ధమాడుతున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రిగా ఉండి దంచుండ్రి, కొట్టండి, చితక్కొటండ్రి, చింతకాయ కొట్టుండ్రి వంటి మాటలతో రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతినవా? అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ఒక్క కమ్యూనల్ సంఘటన కూడా జరగలేదని, కానీ రేవంత్‌రెడ్డి హయాంలో 9 కమ్యూనల్ ఘటనలు జరిగాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు బంద్‌చేసి సభ్యతతో మాట్లాడాలని హరీశ్‌రావు హితవు పలికారు.



# కాంగ్రెస్ అంటేనే బోగస్

- రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన
- ప్రజాస్వామ్యం ఖూనీ అయింది
- పాలన చేతకాకుంటే దిగిపోండి
- బీఆర్ఎస్‌పై దాడులు చేస్తే సహించం
- బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అంటేనే బోగస్ అని బీఆర్ఎస్ సీనియర్ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విమర్శించారు. బాధ్యతాయుత పదవిలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పార్టీ కార్యకర్తలను రెచ్చగొట్టి..రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారని ప్రశ్నించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ చేశాం హరీశ్‌రావు రాజీనామా ఏమైందని మరోసారి ముఖ్యమంత్రి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. రుణమాఫీతో పాటు ఆరు గ్యారంటీలు అమలు చేస్తే ఇప్పటికీ రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని మరోసారి అబద్ధాలు మాట్లాడుతున్నారని, దీనికి నిరుద్యోగులే సమాధానం చెపుతారని అన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వరికి రూ.500 బోనస్ అని ఉందని, ఎక్కడా సన్నవడ్లకు బోనస్ అనిలేదని మ్యానిఫెస్టోను చూపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, ఎమర్జెన్సీ పాలన సాగుతుందని ఆరోపించారు. అధికారపార్టీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష ఎమ్మెల్యే ఇంటి మీద దాడి చేస్తుంటే పోలీసులు చోద్యం చూశారని, ఇది సర్కారు వైఫల్యమేనని ధ్వజమెత్తారు. శాంతిభద్రతలను కాపాడలేకపోతున్నారని, పాలన చేతకాకుంటే దిగిపోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ కార్యకర్తల మీద దాడులు, అవాంఛనీయ సంఘటనలు జరిగితే సహించేదిలేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్‌రెడ్డి, గోసుల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

# ప్రజాపాలన దినోత్సవం బీజేపీ కుట్రలో భాగం

- కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్ ఆంతర్యాన్ని అర్థం చేసుకోవాలి
- బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): బీజేపీ కుట్రలో భాగంగానే ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ప్రత్యేకించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఏఐసీసీ నుంచి పీసీసీ దాకా కాంగ్రెస్ పార్టీ నేతలు సీఎం రేవంత్‌రెడ్డి ఆంతర్యాన్ని గ్రహించాలని సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులకు లేఖ రాశారు. 1948 సెప్టెంబర్ 17న ఇండియన్ యూనియన్‌లో హైదరాబాద్ స్టేట్ విలీన నేపథ్యాలను గ్రహించాలని సూచించారు. ప్రజాపాలన దినోత్సవం కాంగ్రెస్ పార్టీ మూలసూత్రాలకు, భావజాలానికి విరుద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. భవిష్యత్ రాజకీయ అవసరాల కోసమే రేవంత్‌రెడ్డి బీజేపీ నినాదాన్ని ఎత్తుకున్నారనే అనుమానాలున్నాయన్నారు. చారిత్రక అంశాన్ని ప్రజాపాలనతో ముడిపెట్టి చూడటంలోనే సీఎం రేవంత్‌రెడ్డి కుట్రదాగి ఉన్నదనే విషయాన్ని అర్థం చేసుకోవాలని కోరారు. ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహించడాన్ని తెలంగాణ సమాజం జీర్ణించుకోదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భవిష్యత్‌లో బీజేపీలో విలీనం చేసేందుకు సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మలచుకున్నారని విమర్శించారు.

### బీఆర్ఎస్ జాతీయ సమైక్యతా దినోత్సవం

బీజేపీతో భవిష్యత్ పొత్తులో భాగంగా బీజేపీ ఎజెండాను రేవంత్ సర్కార్ అమలు చేస్తున్నదనే అనుమానాలు కలుగుతున్నాయని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను బీజేపీ విమోచన దినంగా, కమ్యూనిస్టులు తెలంగాణ విమోచన దినంగా నిర్వహించాయని ఉదహరించారు. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని జాతీయ సమైక్యత దినోత్సవంగా పాటించి తెలంగాణలో గంగా జమునా తహెజీబ్ సంస్కృతిని పరిరక్షించిందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీనదినం వజ్రోత్సవాలను ఏడాది పొడవునా నిర్వహించాలని 2022లో టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ప్రకటించి ప్రస్తుతం విస్మరించారని దుయ్యబట్టారు. విలీనదినం, సమైక్యతా దినోత్సవం వంటి స్థిరపడిపోయిన నినాదాలను, సంప్రదాయాలకు విరుద్ధంగా రేవంత్‌రెడ్డి ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడంలోని దూరదృష్టిని, బీజేపీ ఎత్తుగడను అర్థం చేసుకోవాలని కోరారు.

# తెలంగాణ తల్లికి అపచారం

మొదటిపేజీ తరువాయి...

వేళ సచివాలయం ఎదురుగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు గుట్టుగా ఏర్పాట్లు చేసింది. ఒకవైపు మిలాద్ ఉన్ నబీ, మరోవైపు వినాయక నిమజ్జనం హడావుడిలో ప్రజలుంటే ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించింది. సోమవారం రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు ముహూర్తం ఖరారు చేసింది. విచిత్రం ఏమిటంటే.. విగ్రహావిష్కరణకు ఎలాంటి కారణమూ లేదు. రాజీవ్‌గాంధీ జయంతీ కాదు, వర్ధంతీ కాదు. ఆయనకు సంబంధించిన మరో సందర్భం కూడా ఏదీ లేదు. అయినప్పటికీ పంతానికి పోయి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాల్సిన ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నది. ఇందుకు సంబంధించి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ పేరుతో ఆహ్వానాలు వెళ్లాయి. విగ్రహావిష్కరణను ఎవడు ఆపుతడో చూస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రజలు పండుగ సంబురాల్లో ఉండగా విగ్రహావిష్కరణకు పూనుకోవడంలో ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తెలంగాణ ఆత్మపై సర్కారు ఆడుతున్న ఆటగానే దీనిని పలువురు అభివర్ణిస్తున్నారు.

### మేధో సమాజం లేఖతో వెనక్కి తగ్గిన గాంధీలు

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలనుకున్న ప్రదేశంలో ఎవరి విగ్రహాలు పెట్టినా ఊరుకునేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గతంలోనే తేల్చిచెప్పారు. సచివాలయం ఎదురుగా ఉన్న అమరవీరుల స్మృతి చిహ్నం పక్కన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని.. ఆ స్మృతి చిహ్నం ప్రారంభోత్సవ సభలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. అందుకోసం సచివాలయం ముందున్న సిగ్నల్ పాయింట్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం మార్చి రోడ్డును వెడల్పు వేసింది. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన స్థలాన్ని సిద్ధం చేసింది. ఆ ప్రతిపాదిత స్థలంలో రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించగానే తెలంగాణ సమాజం భగ్గుమన్నది. దీంతో వెనక్కి తగ్గిన రేవంత్‌రెడ్డి సచివాలయం బయట కాదు లోపలే తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని హడావుడిగా భూమిపూజ చేసి ప్రజాగ్రహాన్ని చల్లార్చే ప్రయత్నం చేశారు. మరోవైపు, ప్రొఫెసర్ హరగోపాల్ సహా తెలంగాణ కవులు, కళాకారులు, పాత్రికేయులు, సాహితీవేత్తలు మొదలుకొని తెలంగాణ మేధో సమాజం రాహుల్‌గాంధీకి లేఖరాసింది. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన ప్రదేశంలో రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయకూడదని, ఒకవేళ చేస్తే కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని లేఖలో స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే రాజీవ్‌గాంధీ విగ్రహ వివాదంలోకి తల దూర్చకూడదని భావించిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ చివరికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సైతం సోమవారం నాటి కార్యక్రమానికి దూరంగా ఉన్నారనే ప్రచారం జరుగుతున్నది.

### కాంగ్రెస్ విగ్రహ మథనం

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు విషయంలో వివాదం నెలకొనడంతో గాంధీ కుటుంబం సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానాన్ని తిరస్కరించినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. నిజానికి విగ్రహావిష్కరణ విషయంలో రేవంత్‌రెడ్డి అనేకసార్లు వారి వద్ద ప్రస్తావించినా పెద్దగా పట్టించుకోలేదని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలోనే రేవంత్ వారి ఆమోదం ఉందని చెప్పుకునేందుకు తగిన సమయాన్ని ఎంచుకున్నారని చెప్తున్నారు. సోనియాగాంధీ ఆరోగ్య పరిస్థితులు, రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో ఉండటం, వయనాడ్‌లో పోటీచేసేందుకు ప్రియాంకగాంధీ అటువైపు దృష్టిసారించడం, ఇక కర్ణాటకలో నెలకొన్న రాజకీయ అనిశ్చితిపై మల్లికార్జున్‌ఖర్గే మంతనాల్లో తలమునకలు కావడం వంటి అంశాలను సీఎం రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా మలచుకొని ఇదే సరైన సమయంగా భావించారని పార్టీలో జోరుగా చర్చ సాగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డికి అటు పార్టీలోను, ఇటు తెలంగాణ సమాజంలో అనుకూల వాతావరణం ఉంటే రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటును ఇంత గుట్టుచప్పుడు కాకుండా, ఎటువంటి ప్రచార పటాటోపం లేకుండా ఎందుకు నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొంటారు.

# నాయిని రాజేందర్‌రెడ్డి ఓ బ్లాక్‌మెయిలర్

- ఆయనకు కేటీఆర్‌ను విమర్శించే స్థాయిలేదు
- మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్




తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వినయ్ భాస్కర్. పక్కన వాసుదేవారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఒక బ్లాక్‌మెయిలర్ అని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. నాయినికి కేటీఆర్‌ను విమర్శించే స్థాయిలేదని, కేటీఆర్‌ను విమర్శించడం అంటే సూర్యుడి మీద ఉమ్మి వేయడమేనని అన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి మెప్పుకోసం మాజీ మంత్రి కేటీఆర్‌పై అనుచితంగా మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. నాయిని ప్రజానాయకుడు కాదని, రాజకీయ బ్రోకర్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల సూట్‌కేసుల కోసం బ్లాక్ మెయిల్ చేయడం ఆయనకు అలవాటేనని అన్నారు. ఉద్యమకారులపై అవాకులు చెవాకులు పేలితే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ తమ నాయకుడు కేటీఆర్‌ను విమర్శించే ముందు మీ నాయకుడు రాహుల్‌గాంధీ ఎక్కడి నుంచి వచ్చాడో చెప్పాలని సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమంలో యువతకు స్ఫూర్తిగా నిలిచిన కేటీఆర్‌పై అవాకులు, చెవాకులు పేలితే ప్రజలు మీ నాలుకలను తెగ్గోస్తారు జాగ్రత్త అంటూ వాసుదేవరెడ్డి హెచ్చరించారు.

# 17 మాడల్ స్కూళ్లలో టీచర్లు సున్నా

- అర్బన్‌లో ఫుల్.. రూరల్‌లో నిల్
- ఇటీవల బదిలీల్లో టీచర్లకు స్థానచలనం
- పట్టణ ప్రాంతాలనే ఎంచుకున్న టీచర్లు




హైదరాబాద్, సెప్టెంబర్ 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 194 మాడల్ స్కూళ్లు ఉండగా, వీటిలో 17 స్కూళ్లల్లో ఒక్కరంటే ఒక్క టీచర్ కూడా లేరు. దీంతో ఈ స్కూళ్లు జీరో టీచర్లతోనే నడవనున్నాయి. విద్యార్థుల్లేక టీచర్లు లేరని అనుకుంటే పప్పులోకాలేసినట్లే. విద్యార్థులున్నా.. టీచర్లు లేని పరిస్థితి ఈ స్కూళ్లల్లో నెలకొంది. ఆదిలాబాద్ జిల్లాలోని సిరిపూర్ మాడల్ స్కూల్లో ఒక్కరంటే ఒక్క టీచర్‌కూడా లేరు. ఈ స్కూల్లో గతంలో 10 మందికి పైగా టీచర్లు పనిచేసేవారు. కానిప్పుడు ఒక్క టీచర్‌కూడా లేరు. ఇక ఇదే జిల్లాలోని నార్నూరు మాడల్ స్కూల్లో ఇదే పరిస్థితి. ఇటీవలి టీచర్ల బదిలీలతో రాష్ట్రంలోని పలు మాడల్ స్కూళ్లు కుదేలయ్యాయి. పలు స్కూళ్లల్లో టీచర్ల కొరతకు దారితీసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలకు సమీపంలోని మాడల్ స్కూళ్లు టీచర్లతో నిండిపోగా, మారుమూల ప్రాంతాల్లోని మాడల్ స్కూళ్లు ఖాళీ అయ్యాయి. ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని అత్యంత మారుమూల ప్రాంతాలు, రాష్ట్ర సరిహద్దులోని స్కూళ్లు, సంగారెడ్డి జిల్లాలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లోని టీచర్లంతా బదిలీలకు పట్టణ ప్రాంతాలకు బదిలీ అయ్యారు. అయితే ఇతరులు వీటికి ఎంపికచేసుకోకపోవడంతో ఇప్పుడా స్కూళ్లల్లో టీచర్ల కొరత సమస్యకు దారితీసింది. రాష్ట్రంలో 194 మాడల్ స్కూళ్లున్నాయి. శనివారం టీచర్ల బదిలీలు చేపట్టగా, 1,923 మంది పీజీటీలు, 745 మంది టీజీపీల చొప్పున మొత్తంగా 2,757 మంది టీచర్లు బదిలీ అయ్యారు. వాస్తవానికి ఒక్కో మాడల్ స్కూల్ కనీసంగా 500 మంది విద్యార్థులుంటారు. ప్రతి స్కూల్లో కనీసంగా 20 మంది టీచర్ల అవసరముంటుంది. తాజా బదిలీలతో ఒకట్రెండు స్కూళ్లల్లో ఒక్కరంటే ఒక్క టీచర్‌లేకుండా పోయారు. మరికొన్ని మాడల్ స్కూళల్లో ముగ్గురు, నలుగురు టీచర్లే ఉన్నారు.

### పరిస్థితి ఇలా..

- ఆసిఫాబాద్‌లోని మాడల్ స్కూల్లో మొత్తం 807 మంది విద్యార్థులున్నారు. రాష్ట్రంలో అత్యధిక విద్యార్థులున్న స్కూల్ ఇదే. గతంలో ఈ స్కూల్లో 17 మంది రెగ్యులర్ టీచర్లు పనిచేసే వారు. తాజా బదిలీలతో ఈ స్కూల్లో కేవలం ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు. ఇందులో ఒకరు ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ కాగా, మరొకరు పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్.
- ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మాడల్ స్కూల్లో గతంలో 16 మంది టీచర్లుండేవారు.. కానిప్పుడున్నది కేవలం ముగ్గురంటే ముగ్గురే.
- కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మాడల్ స్కూల్లో ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు.
- సంగారెడ్డి జిల్లా వట్‌పల్లిలో 5, రాయికోడ్‌లో ఆరుగురు టీచర్లు, నాగలిగిద్ద మోర్గిలో కేవలం ముగ్గురు టీచర్లు మాత్రమే ప్రస్తుతమున్నారు.

### ఉపాధి కోల్పోయిన హెచ్‌బీటీలు..

మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలతో టీచర్లు సంతోషంలో ఉండగా, ఇదే పాఠశాలల్లో పనిచేస్తున్న అవర్లీ బేస్డ్ టీచర్లు(హెచ్‌బీటీ) ఉపాధి కోల్పోయారు. ఇది వరకు రెగ్యులర్ టీచర్లు లేకపోవడంలో హెచ్‌బీటీలను తీసుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 1,200 మంది హెచ్‌బీటీలు పనిచేశారు. తాజా బదిలీల్లో రెగ్యులర్ టీచర్లు రావడంతో హెచ్‌బీటీలను తొలగించాల్సిన పరిస్థితి తలెత్తింది. విద్యాసంవత్సరం మధ్యలో హెచ్‌బీటీలను అర్ధాంతరంగా తొలగించడంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో బదిలీలతో డిస్టర్బ్ అయిన హెచ్‌బీటీలను పక్క మండలాలు, అదేజిల్లాల్లో ఖాళీగా ఉన్న స్కూళ్లల్లో అవకాశం కల్పించిన న్యాయం చేయాలని, కుటుంబాలను ఆదుకోవాలని హెచ్‌బీటీల సంఘం అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు.